

వాసిని
యామినీదేవి

గుండెలో రగిలే మంటలో శత్రు కరవాలం చలి తీర్చుకున్నది. వీరేంద్రసింగ్ రక్తంలో తడిసి ముద్దయినాడు. శత్రు భేద్యమైన గుండెలాంటి కోటలో పఠాన్లు ప్రవేశించి, కోటలాంటి గుండెలో గునపం గుచ్చారు. చెట్టంత మనిషి, నిట్టనిలువునా కూలిపోగా. పరదా ఒత్తిగిలించి చూచింది విమల, అతని నీడలోనే హర్మ్యాలు నిర్మించుకున్న యిల్లాలు. ఓపిక తన ఆధీనంలో ఉన్నంతమేరకు పోరు సాగించాడు పాపం, కాని కాలం శత్రుసైనికునిరూపాన కాటేసింది.

విమల, భర్త దుస్థితికి కన్నీరుమున్నీరుగా విలపించే వ్యవధిలేక, పరుగు పరుగున అభ్యంతర విలాస మందిరానికే చేరుకున్నది రాచవారి విలాసమందిరాలలో అనుమతి లేకుండా చొరబడరాదు, నిజమే. కాని కడుపుతీపివల్ల కట్టుకున్నవాడు కత్తుల బోనులో చిక్కుకున్నా, కన్నబిడ్డ భవిష్యత్తునైనా కాపాడాలన్న తపనతో, కన్నీటిని గుండెల్లోనే ఎండబెట్టి పరుగున వచ్చింది.

రాజకుమార్ జగత్‌సింగ్, ప్రియురాలి పరిష్వంగ సుఖంలో, స్వర్గసోపానాలు లెక్కిస్తున్నాడు. అతివ సౌందులో ఆదమరచి, సోలిపోయి ఉన్నాడు. అతిలోక లావణ్యవల్లి తిలోత్తమ, నునులేత పెదాలతో అతనికి అధరామృతాన్ని ఆరగింపు చేస్తున్న తరుణంలో, విమల శయ్యామందిరం ప్రవేశించింది. రహస్యం చెవి కొరికింది.

ఏమరుపాటున, మధుర లోకాలలో, తూగుటుయ్యాల లూగుతున్న, ప్రేమ పక్షులు, రెక్కలల్లార్చాయి. వడిసెల వేటదిన్న పక్షుల్లా ముగ్గురూ, రహస్య ద్వారం వేపు పరుగుదీశారు. గవాక్షాలను, కవాటాలను క్షణంలో దాటారు. మరో క్షణంలో రహస్య ద్వారం దాటి, బిల మార్గం చేరి, బంధాలు మూయబడేవేళ, కాల కింకరుల్లా, నలుగురు పఠాను యోధులు. పలాయనం చిత్తగించే హరిని గమనించి, పరుగున వచ్చారు. కత్తులు తళతళలాడాయి. కుత్తుకలపై ఎగబాకాయి.

ఇద్దరాడవారి మధ్యనున్న, రాజకుమారుడు జగత్‌సింగ్, భీరువుకాడు. రాజపుత్ర రక్తం అతనిలో ఎండిపోలేదు. పారిపోవడానికి వీల్లేని ఘట్టం. 'అల్లాహో అక్బర్' అంటూ పఠాన్లు, మీది కురికారు. జగత్‌సింగ్ కత్తి గాలిలో మెరిసింది. వేటు కొకటిగా శత్రువుల తలలు నేల వాలాయి. నలుగురు యోధులు నేల రాలే సమయానికి, మరొక దండు దండుకున్నది. ఇంక పోరాడి ప్రయోజనం లేదు. ప్రతిఘటన నిష్ఫలం. అప్పటికే అలసిపోయి, చెమటోడ్చుతున్నాడు. శత్రుఘాతాలకు, శరీరం యావత్తూ రక్త చందనం అలముకున్నట్లు అయింది. పఠాన్ల కత్తుల పదునుకు అతను ఎరగాబోతున్న తరుణంలో, ఎవరిదో కేక, గంభీరంగా వినిపించింది.

'అతన్ని చంపకండి ప్రాణాలతో పట్టితెండి' ఆమాటలో హుకుం వినిపించింది... ఉస్మాన్‌ఖాన్ గొంతు కంచుగంట. సర్వసైన్యాధిపతి కాబట్టి అతనిమాట సైనిక కూటమిలో, శాసనం. నవాబ్ కత్లూఖాన్‌కు అతను యిష్టుడు.

జగత్‌సింగ్‌కు ఎప్పుడో తెలివి తప్పింది. నిర్జీవ స్థితిలో, మగతగా, కనురెప్పలు ఎత్తినపుడు, అది ఏ లోకమో తెలియదుగానీ, మంజుల కిన్నెరీస్వనం చెవుల సోకింది. అటూ, ఇటూ పరికించాడు పదారు పన్నెల ముగ్ధ, లావణ్యసుందరి, ఏ దేవకన్యో, అప్సరాంగనో, తన ప్రక్కచేరి, గాయాలకు మందురాసి, సేవ చేస్తోంది. దూరాన, తివాచీపై కూర్చున్నది ఉస్మాన్‌ఖాన్ అని గ్రహింపు కలిగింది. జగత్‌సింగ్ అనుమానం, పెనుభూతం కాగా పెదవి కదిపి ప్రశ్నించాడు, అవాసక్తంగా—

'నే నెక్కడున్నాను?'

దాపున చేరిన కలకంఠ కమనీయ కంఠస్వరం ఊరడించింది, 'మరేం భయపడకండి, సురక్షితంగానే ఉన్నారు'

'ఏవేళైందిప్పుడు?' మరో ప్రశ్న. తన స్థితికి, ఉనికికి అదొక సూత్రం కావాలి.

'అపరాత్రి' ఆమె తీయనిమాట.

'నీ వెవరు ?' పలుకులో పదును, రాజసం ... కదలలేని స్థితిలోనూ కరుకుదనం,

'ఆయెషా' ఆమె సంతోషంతో నిట్టూర్చింది.

అతని భావవీచికలలో తిలోత్తమ రూపొందింది...క్షణం నిర్వేదం..... మరుక్షణంలో నరాలు చిట్లి రక్తం స్రవించి స్పృహ తప్పి పోయింది.

'ఉస్మాన్' ...వెంటనే హకీంను పిలిపించు.' ఆయెషా ఆజ్ఞ అంచెలంచెలుగా హకీంను చేరింది. అతడు రెక్కలులేని విమానంలో వచ్చి వాలాడు ఆయెషా మ్రోల. అవసరమైన మందులు, తోచిన మాకులు ఉపయోగించాడు..... తెల్లవారింది, కాని జగత్‌సింగ్‌లో చలనం లేదు. ఊపిరి మాత్రం ఆడుతున్నది, సజీవుడే అనడానికి నిదర్శనంగా. ఒక్కసారిగా జ్వరం తారస్థాయికి చేరింది. శరీరం కొలిమిలా కాలుతున్నది. రాజవైద్యుడు ఎన్నోసార్లు వచ్చి ఎన్ని మందులు వాడినా గుణం కనిపించ లేదు. ఆయెషా కంటికి కునుకు కరువైంది. అన్నపానీయాలు విసర్జించింది. కంటికి రెప్పలా రాజకుమార్ ప్రక్కనే కనిపెట్టుకుని ఉన్నది.

చీకటి పడ్డది. క్షణాలు యుగాలుగా నిశిరాత్రి దాటింది. రాజకుమార్ కళ్ళు తెరిచాడు. అతని పెదాలపై నిర్జీవ హాసం లాస్యం చేసింది ఆమె బరువుగా నిట్టూర్చింది గుండె బరువు కొంత తగ్గింది. కాని అతని మనసు విశ్రాంతి తీసుకోవడం లేదని ఆమె గ్రహించింది...మనసున ముసురు పట్టింది. మంచుపొగ క్రమ్మింది. ఏదో జ్ఞాపకం అతన్ని కకావికలు చేస్తోంది. అది ఏది ?

కొన్ని క్షణాలు గడిచాయి. రాజకుమార్ గుండె దిటవు చేసుకుని ప్రశ్నించాడు, 'నేనెక్కడున్నాను?'

'కత్లూఖాన్ కోటలో' ఆమె, ఆయెషా మంద్ర స్థాయిలో, మంజులంగా సమాధానం చెప్పింది.

జవాబు విన్న మరక్షణంలో అతని మతి తప్పింది. మరో రెండురోజులు, ఏ లోకాలలోనో ఉన్నాడు. అప్పుడు, ఈ లోకంలో కళ్ళు తెరిచి అడిగిన ప్రశ్న.

'నేనిక్కడెందుకున్నాను.'

ఆమెకు వెంటనే సమాధానం చెప్పే ధైర్యం లేదు. మరలా మగత నిద్రలో కరిగిపోతాడని జంకు. కాని చెప్పక తప్పదు. తెలిసీ తెలివిడి చేయక పోవడం లక్షణం కాదు. 'మీరు జబ్బుతో ఉన్నారు అన్నది... దాని కొసన, కనిపించిన సమాధానం.

జగత్‌సింగ్ అజ్ఞానికాదు, అతివల ఆంతర్యం ఎరిగినవాడే, మాటల చాటున దాగిన మమతలు, గ్రహింపుచేసుకో గల సరసుడే. తల అడ్డంగా ఊపి, విషాదంతో

చిరునవ్వును రంగరించాడు:

'నేను బందీని కదూ' అన్నాడు. దానికీ, సుకుమారి ఆయేషా మౌనమే సమాధానం.

'ఇంతకీ నీవెవరవు' అతడే తిరిగి ప్రశ్నించాడు.

'ఆయేషా' అన్నది రూఢిగా.

'ఆయేషా! అంటె?' అతని ప్రశ్న.

'నవాబ్ కల్యాణ్ఖాన్ గారాల కూతును.

జగత్‌సింగ్‌కు మాటలు పొడిగించే త్రాణ లేదు. కొంతసేపు ఊరుకున్నాడు. చివరకు అడిగాడు.

'నేనిక్కడ ఎంతకాలంగా వున్నాను?'

'నాలుగురోజులు'

'అయితే కోట వీగా ఏలుబడిలోకి వచ్చింది'

'అవును'

'వీరేంద్రసింగ్ ఎక్కడ?'

'కారాగారంలో...ఈరోజు ఉరితీస్తారు'

అతను వేటుదిన్న పులిలా చూచాడు.

'అతనికయిన వారెక్కడున్నారో?'

ఆయేషా గ్రహించింది. సమాధానం తన నోటితో చెప్పడం యిష్టంలేదు.

'నాకు తెలీదు' అన్నది.

'మీ ఆరోగ్యం బాగాలేదు. ఎక్కువగా మాట్లాడవద్దని హకీం చెప్పారు. దయచేసి విశ్రాంతి తీసుకోండి' అని అతని ఆలోచనలు తప్పించింది. ఏవో మందులుతీసి అతనికి అందించింది. ఆయేషా కళ్లలోని కామనలు గ్రహించాడు రాజకుమార్. ఆమె జేల కన్నులలోకి సూటిగా చూస్తూ అన్నాడు.


# ఆయేషా

'తెలివి తప్పిన స్థితిలో ఒక కలగన్నాను. ఎవరో ఒక దేవత నన్ను కాపాడి, ఉపచరించింది. ఎవరామె? నీవా! తిలోత్తమా?'

'బహుశా తిలోత్తమ అయివుంటుంది' అన్నది ఆయేషా, గుండెలలో కొండల బరువు మోస్తూ...

తిలోత్తమ పేరు వినగానే, జగత్‌సింగ్ మనసు ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరైంది.

తుఫానురాత్రి తాను ఆమెను, ఒంటిగా కలుసుకున్నాడు! ఎక్కడ? బిలేశ్వరాలయంలో తలదాచుకొనడానికి వెళ్లిన తనకు, అదే స్థితిలో ఉన్న తిలోత్తమ కనిపించింది. ఆమె అపూర్వ సౌందర్యం, తనను ముగ్ధుణ్ణి చేసింది, ఆమె ముగ్ధ అయింది. తనను చూచి పిరుదులు దాటిన ఆమె కేశాలు, వానకితడిసి ఒంటినంటిన చీర ఆమె యవ్వనాన్ని, సౌందర్యాన్ని, ప్రత్యంగుళంలో కమనీయంగా ఉద్దీపింపచేసింది. తిలోత్తమ మేలి ముసుగులోనుండి తనను వీక్షించింది. కళ్లు కళ్లు కలుసుకున్నాయి. గుండెల్లో దాగిన హృదయాలకు సంకేతాలు, సందేశాలు అందజేశాయి. ఆమె సిగ్గుల మొగ్గగా, తలవంచుకుని, వసుందరిలా పులకరించింది. ఆ పులకరింత తనపై పూలవాన కురిపించింది. తనకు ఆ క్షణంలో, ఆ మధుర క్షణంలోనే తోచింది, ఆమె, తన దేవేరి అని, తన ప్రేమనీరాజనాలు అందుకో సిద్ధమైనదని. కాని ఆమె ఎవరో ఆ క్షణంలో తెలియదు.




తనకు ఆతిథ్యం యిచ్చి, ఆదరిస్తున్న విమలతో చెప్పాడు తన గుండె గుబులు గురించి. ఆమె ప్రసన్నంగా నవ్వింది. సరే నన్నది. చూదామనీ అన్నది...ఆ చిన్నదాని చెలిమికోసం రాజకుమారుడు అలమటించాడు...నిద్రాహారాలను జతచేసి విసర్జించాడు.

వెలపొడుపునాడు, విధాయకంగా కోనెలకు బయలుదేరాడు దేవతార్చన కోసం. అక్కడే స్వప్న సుందరి, నిజరూపంలో ఎదురైంధి. తోడుగా వచ్చిన విమల నవ్వింది. ఇద్దరికీ పరిచయం చేసింది. పుట్టుపూర్వోత్తరాలు కులగోత్రాలు ఏకరువు పెట్టింది ఏకబిగిని. అదృష్టం అరచేతిలో విరిసింది. ప్రసన్నసుందరి తిలోత్తమ ఎవరోకాదు, విమల కూతురే, అవరోధాలు లేని ఝరీ ప్రవాహం ప్రేమ ... నాటి నుండి మలుపులు తిరిగింది.

జగత్‌సింగ్ శరీరానికి తగిలిన గాయాలు మానుపట్టాయి. కాని మనసుకు తగిలిన గాయం? స్వస్థత చేకూరిన తర్వాత తిలోత్తమను గురించిన ఆవేదన ఎక్కువైంది. ఆమె ఎక్కడున్నది? ఏ స్థితిలో ఉన్నట్లు? తన గది ఏమిటి? ఈ ఆయేషా ప్రవేశానికి అర్థం, అంతర్యం ఏమిటి? పైగా వీరేంద్రసింగ్‌కు ఉరిశిక్ష?

ఆయేషా, సంపూర్ణ విశ్వాసంతో, ప్రేమతో అతన్ని బ్రతికించుకున్నది ... సేవించింది. ఉదయం అతని మందిరంలోకి వస్తే తిరిగి అమ్మ పిలుపు అందేవరకు కదలదు. ఆమె అందం ఆరాధన, అతన్ని పులకింపచేస్తున్నాయి.

జగత్‌సింగ్ కాస్త అటు, ఇటు తిరుగుతున్న సమయంలో ఒక వాచాలుడు చెప్పాడు, విమల తిలోత్తమ, కల్యాణ్ఖాన్ రాజప్రాసాదంలో దాసీలుగా ఉన్నారని. ఆ వార్త అగ్నిలా అతని రక్తాన్ని ఉడికించింది ... రాత్రి అంతా కంటికి నిద్రరాలేదు మరురోజు కల్యాణ్ఖాన్‌తో గోష్టికి విన్నపం పంపాడు.

నవాబు సైతం, అతని వీరోచిత చర్యలకు మక్కువ పడ్డాడు...అతనితో మాట్లాడాలని సరదా పడ్డాడు. విశాల హృదయంతోనే విన్నపాన్ని మన్నించి ఆదరంగా ఆహ్వానించాడు. జగత్‌సింగ్ చనిపోతే లాభం లేదు. అతను బ్రతికుంటేనే విలువ. తాను జగత్‌సింగ్‌ను క్షణంలో కడతేర్చగలడు. కాని అతని తండ్రి రాజా మాన్‌సింగ్ అతి

బలాఢ్యుడు. తనపై దండెత్తి, తనను తునాతునకలు చేయగలడు. మాన్‌సింగ్‌తో, తన షరతులతో సంధి చేసుకోవడానికి జగత్‌సింగ్‌ని ఉపయోగించాలని అతని వన్నాగం. అవే షరతులు, జగత్‌తో చెప్పాడు. కానీ పౌరుషం మొక్కపోని జగత్ వాటిని కాలరాచి వేశాడు. ఆగ్రహంతో జగత్‌ను చెరసాలలో బంధించమని హుకుం జారీ చేశాడు కల్యాణ్‌ఖాన్.

జరుగుతున్న తతంగాలన్నీ విమలకు తెలుస్తూనే ఉన్నాయి...జగత్‌ను చెరసాలలో వేశారని తెలియగానే కోటనుండి తప్పించడానికి ఆమె పథకం వేసింది. సైన్యాధిపతి ఉస్మాన్‌ను మురిపించి అనుమతి ముద్రిక సంపాదించింది. తిలోత్తమకు ఇచ్చి, అర్ధరాత్రి కోట సింహద్వారం చేరుకొమ్మని సలహా యిచ్చింది ముద్రికతోపాటు. అక్కడ మరొక వ్యక్తి ఎదురై, అలాటి ముద్రికనే చూపిస్తాడు. ఆమెను అభిరామ్‌సూరి యింటికి చేర్చుతాడు. తాను మరునాడు వెళ్ళి వారిని కలుస్తుంది. ఇదీ ప్రక్రియ.

చెప్పినట్లే తిలోత్తమ అర్ధరాత్రి దాటగానే, కోట సింహద్వారంవేపు బయలుదేరింది. జగత్‌సింగ్ బందీగా వున్న చెరసాల దగ్గరకు రాగానే ఆమె కాళ్ళు స్వాధీనం తప్పాయి...మనస్సు మారింది...తాను బయలుదేరిన పని మరచిపోయింది...'జగత్ సింగ్' అనే పేరునే ఉచ్చరించింది.

ఆమె చేతినున్న ఉంగరం చూచాడు. ద్వారపాలకుడొకడు ఆమె నోటి మాట విన్నాడు 'జగత్ సింగ్' అని. ఆమె అతని కోరకే వచ్చిందనుకొన్నాడు. అనుకుని ఆమెను వెంటపెట్టుకుని కారాగారంలోకి తీసుకువెళ్ళాడు. జగత్‌సింగు ఎదురుగా నిలబడ్డాడు. ఆమెకు నోట మాట రాలేదు. అతని పాదాలపై బడి కన్నీటితో అభిషేకించింది...అతను దిగ్గున అడుగు వెనక్కి వేశాడు. 'నీవు వీరేంద్రసింగ్ కుమార్తెవు ... ఇదేం పని, వెళ్ళిపోమ్మా' అన్నాడు తల త్రిప్పుకుని.

జగత్‌సింగ్ మాటలు, ఆమెకు అశనిపాతంలా సోకాయి. అతని కటువర్తనకు మూర్ఛపోయింది...'ఆయెషా'ను పిలవమని ద్వారపాలకునితో చెప్పాడు.

ఆయెషా వచ్చింది. చూపులోనే జరిగింది గ్రహించింది. తిలోత్తమ ప్రక్కనే కూర్చుని, ఆమె తల తన ఒడిలోకి తీసుకుని, ముఖంపై చన్నీరు చిలికింది...తిలో


ఋతుక్రమం ఆలస్యమైతే?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవి పిల్సు" వాడండి




పూర్తికోర్సు ప్యాకెట్టు 28 మాత్రలువెల రు.11/-
సగం కోర్సు ప్యాకెట్టు 14 మాత్రలువెల రు. 6/50
వి.పి.పి. అదనము
ప్రతిచోటదొరకును

దేవి పిల్సు ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాకపోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టకుదేవిపిల్సు బాగుగ గుణమిచ్చును

1 అన్నిసందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగించదు.

Mfrs: SEENU & CO., MADRAS-21

ప్రఖ్యాత కెమిస్టులు మరియు డ్రగ్గిస్టు లందరివద్ద లభించును.

Advt. Permitted under G.O. MS. No. 1121



కాశ్మీర్ బొకె టాల్కుతో గంటల తరబడి పరిమళవంత ముగాను తాజాగాను వుండండి

పూలవలె తాజాగాను పరిమళంగాను వుండే కాశ్మీర్ బొకె టాల్కు మిమ్మల్ని సువాసనలతో నింపుతుంది. దాని చల్లదనాన్ని, పూలరేకులలాంటి మృదు స్పర్శను, మనోరంజకమైన పరిమళాన్ని మీ చుట్టు ప్రక్కలంతా అనుభవించండి. గంటల తరవాత కూడా ఎక్కువ సేపు నిలచే కాశ్మీర్ బొకె టాల్కు పరిమళము పూలమేఘము వలె మిమ్మల్ని ఆవరించినట్లుగా అనుభూతిని పొందుతారు.







కాశ్మీర్ బొకె టాల్కు అత్యుత్తమమైన సౌందర్యవర్ధక టాల్కు మాత్రమే కాదు. అది బిడ్డలకొరకు కూడా అత్యుత్తమైనది. మీ ఇద్దరూ ఉపయోగించడం ఒకే పౌడర్ అందుబాటులో ఉండటం చాలా వీలు.




కాశ్మీర్ బొకె

పురుషులు అమితంగా ఇష్టపడే పరిమళమైన టాల్కం పౌడరు

కాల్గేట్ వారి ఒక వాణ్యమైన ఉత్పత్తి




పశువులను తినగల్గే సాలీళ్లను గురించి విన్నారా? నేలమీదనే సంచరించే టరంట్యులా అలాంటిది. సుమారు 3 అంగుళాలను మించిన శరీరానికి, 7, 8 అంగుళాల కాళ్ళుంటాయి. సాధారణంగా వీటి ఆహారం పురుగులే. అవకాశం వస్తే చిన్న పశువులను చంపి తింటుంది. దీనివల్ల మనకు ప్రమాదం లేదు కాని, తేనెటీగ కుట్టినంత బాధపెడుతుంది. ఇంత బలం ఉన్న కందిరీగకు సాధారణంగా బలి అయిపోతుంది. వాటికి మధ్య ఘోరమైన యుద్ధం సాగుతుంది. గెలిస్తే కందిరీగ దీనిని కుట్టి మూర్ఛపోనిచ్చి తన పిల్లలకు ఆహారంగా కానుకనిస్తుంది!

సాలీడులకు రెండు అప్రతిష్ఠ కల్గించే గుణాలున్నాయి. ఒకటి దాని విషతత్వం. వాటికి విషాన్ని క్కించే కోరలున్నా మానవుడికి ప్రమాదం చెయ్యలేవు. ఒకటి రెండు మాత్రం బాధ కల్గిస్తాయి— అదే కుట్టినప్పుడే. తమ భర్తలను హత్య చేసే గుణం ఆడ సాలీళ్ళకుందనేది రెండో ప్రతీతి. మగసాలీళ్లు ఆడవాటికన్నా చిన్నవే. కుటుంబ కలహాలకు బొత్తిగా ఆస్కారం లేదన్నమాట! ఒక్కోసారి ఆడది 2 అంగుళాలు మగది 1/10 అంగుళం ఉంటే, ఇక మగది ఏం చెయ్యగలదు? అయితే కొన్ని రకాలకు ఈ ఘోర గుణం కూడా లేకపోలేదు. దానివల్ల ఆ రకాలను 'విధవ సాలీళ్లు' అని అంటారు కూడా! భర్తను ఘోరంగా హత్య చెయ్యడమే కాకుండా, సుష్టుగా తినేస్తాయి కూడా!

—జిమ్మి కోనేటిరావు



త్తమకు స్పృహరాగానే, ఆయెషా తన చెలికత్తెతో చెప్పింది. 'ఈమెను నా గదికి చేర్చి, అవసరమైన శుశ్రూషలు చేయండి'

'వెళ్లమ్మా...నీకేం భయం లేదు', అని తిలోత్తమకు హామీ యిచ్చింది.

జగత్‌సింగ్ ఏదో తనతో చెప్పాలని ఉన్నట్లు ఆయెషాకు తెలుసు. అందుకే తిలోత్తమతో, చెలికత్తెనుపంపి, తాను వెనకగా నిలిచిపోయింది...జగత్‌సింగ్ ప్రక్కనే నిలబడి ముచ్చటిస్తూ, అప్రయత్నంగా అతని చేతులు తన చేతుల్లోకి తీసుకున్నది. ఆప్యాయంగా, ప్రేమగా నిమిరింది. ఆమె కళ్ళు ఆర్ద్రాలైనాయి.

ఆయెషా అతని స్పర్శతో పరవశించి, కళ్లు మూసుకున్నది. ఓ మధుర లోకాన్ని సృష్టించుకున్నది కళ్లు తెరిచే సరికి, మూడవ వ్యక్తి వెనక ప్రత్యక్షమై 'మంచి పనే చేశావు ఆయెషా' అని వ్యంగ్యంగా అభినందిస్తున్నాడు.

'ఏమిటి నీ అభిప్రాయం' ఆమె తీవ్రంగా ప్రశ్నించింది. పరపురుషుని సమక్షంలో, తన చేత చిక్కిన ప్రియుని హస్తాలు వదిలి వేసింది.

'అర్ధరాత్రి, కారాగారం ప్రవేశించి, పరపురుషులతో ముచ్చటలాడ్డం, ఏ న్యాయ శాస్త్రం అంగీకరిస్తుందో' పెద్దగా, కటువుగా అరిచాడు ఉస్మాన్.

'అది నీ కనవసరం ఉస్మాన్... నా విషయం నాకు తెలుసు' ఆమె చురికలాంటి విసురు విసిరింది.

'నేను అడుగుతున్నాను, నీ సమాధానం చెప్పు.'

'అయితే విను ఉస్మాన్. నేను రాజకుమార్‌ని తల మునకలుగా ప్రేమిస్తున్నాను. ఏమి జరగనీ, నా ప్రేమ చెరగదు, నా బొందిలో ప్రాణం ఉన్నంత కాలం ఈయననే ప్రేమిస్తుంటాను. వారితో ఏం మాట్లాడుతున్నానో చెప్పమంటావా? చెబుతాను విను, వారిని పారిపొమ్మని, సాయం చేస్తానని చెప్పాను, మంచి గుర్రాన్ని యిచ్చి, ద్వారం దాటిస్తానని చెప్పాను. కాని వారు అందుకు ఒప్పుకోవడం లేదు. నా ప్రాణాలకేమి ముప్పువస్తుందో నని, ఆయనలోని రాజపుత్రరక్తం ఆరాట

పడుతోంది. పైగా సిరికివాడుగా వారి పోవడం వారి కిష్టంలేదు'

ఉస్మాన్ నోరు అప్పళించాడు. ఆయెషా కన్నీరు తుడుచుకుంటూ చెప్పింది 'ఉస్మాన్, నిన్ను నొప్పించి ఉంటే నన్ను క్షమించు కానీ నేను తప్పుచేయలేదు. సమయం వచ్చి నపుడు నాన్నతో నా మనసు విప్పిచెబుతాను'

ఉస్మాన్ కొన్ని క్షణాలపాటు చెక్కేసిన శిలగా మారిపోయాడు. తర్వాత, నెమ్మదిగా బయటకు నడిచాడు.

భర్త ఉరికంబం ఎక్కినప్పుడే విమల పగబట్టింది ప్రతిజ్ఞ చేసింది ఎలాగైనా కల్యాణ్‌ఖాన్‌పై పగ సాధించాలి కూతురుతో పారిపోవాలని చేసిన ప్రయత్నం విఫలమైంది. కాగా, కల్యాణ్‌ఖాన్, దర్బార్‌లో నర్తకి అయింది. అదొక్కటే, గౌరవనీయమైన పదవి పగ సాధించడానికి, వలపన్నడానికి. పగలతో పగలు రగిలించడానికి మార్గం

ఓ నాడు, కల్యాణ్‌ఖాన్, నిషాలో, తానీషాగా విమల నృత్యం తిలకిస్తున్నాడు ఖుషీగా. ఆమె గుప్తంగా, ఛురిక భద్రం చేసుకునే ఉన్నది. అదనుచూచి, కత్తిపదును చూపించింది అతని గుండెల్లో దిగినకత్తి, మరుక్షణంలో నేలనగుండెల్లో నూ దిగింది.

రక్తపు మడుగులో, మృత్యు కౌగిలిలో ఉన్న కల్యాణ్‌ఖాన్ జగత్‌సింగ్‌ను రావించి, సంధి కోరాడు. జగత్‌సింగ్‌కు స్వార్థం లేదు. స్వాభిమానంతప్ప అక్బర్ సామ్రాజ్యాధి కారానికి తలవంచితే చాలునని షరతు పెట్టాడు.. కల్యాణ్‌ఖాన్ అంగీకార సూచకంగా తలఊపి, వేలితో అటు దిక్కుగా చూపించాడు అక్కడ ఓగ్రలో కల్యాణ్‌ఖాన్ కుమారుడే సింహాసనంపైన ఉన్నాడు అతనికి అది దక్కితే చాలునని కన్న తండ్రి కన్నుమూసేవేళ పొందిన ఆవేదన. అతని ఆవేదన నిర్వేదంగా అంగీకరించాడు, మానినీ హృదయ చోరుడు జగత్‌సింగ్.

జగత్‌ను వెంటనే విడుదల చేసి, సకల మర్యాదలతో సాగనంపమని, ఉత్తర్వు చేశాడు కల్యాణ్‌ఖాన్. జగత్, సంతృప్తితో లేచాడు. కల్యాణ్‌ఖాన్, పోతున్న ప్రాణాల్ని క్షణకాలం నిలబెట్టి చివరిమాటగా చెప్పాడు 'ఆమె అనాథ.. కాపాడు'

జగత్‌సింగ్ ఎదురుగా ఆయెషా ప్రత్యక్షమైంది. మదిలో తిలోత్తమ మెదిలింది. ●

# ఆంధ్రసచిత్రవారపత్రిక

## 1968 దీపావళి కథల పోటీ

ఎప్పటివలెనే ఈ సంవత్సరం కూడా 'ఆంధ్రసచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీ' నిర్వహించబోతున్నదని తెలపటానికి సంతోషిస్తున్నాము రచయితలందరూ ఎప్పటి వలెనే మాతో సహకరించి ఈ పోటీని జయప్రదం చేస్తారని ఆశిస్తున్నాము.

**మొదటి బహుమతి రు. 2100**

**రెండవ బహుమతి రు. 1500**

**మూడవ బహుమతి రు. 500**

### నిబంధనలు

1. కథలు స్వంత రచనలై ఉండాలి. ప్రతి కథతోనూ రచయిత అది తన స్వంత రచనే నని, దేనికీ అనువాదంకానీ, అనుసరణకానీ కాదని హామీరాసి పంపాలి ఈ హామీలు వేరే కాగితం మీద కాకుండా కథ వ్రాతప్రతి మీదనే రాసి ఉండాలి.

2 కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి

3. వ్రాతప్రతి మీద "దీపావళి కథలపోటీకి" అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒక వైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయితపేరు, పూర్తి చిరునామా కూడా వ్రాతప్రతి మీద స్పష్టంగా రాయాలి. రచనలు 12 అరఠావు (ఎక్సర్సయిజు నోట్‌బుక్ పేజీకి రెండు రెట్లు) పేజీలకు మించరాదు

4 కవరుమీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టిస్ట్రీట్, మద్రాసు—1'కి పంపాలి.

5. పోటీ గడువు తేదీ 14—8—68 ఆ తర్వాత మా కార్యాలయానికి చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.

6. పోటీలో బహుమతి పొందిన కథలని 'దీపావళి ప్రత్యేక సంచికగా' వెలువడే 25—10—68 తేదీ కల ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము

7. పోటీ తుది నిర్ణయం ఆంధ్రసచిత్ర వారపత్రిక సంపాదకుడిదే ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపడానికి వీలులేదు.

8 వ్రాతప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపడానికి సాధ్యం కాదు. పోటీలో పాల్గొనేవారు తమ రచనలతో తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామాకల కవర్లు పంప నవసరం లేదు.

9 పోటీలో బహుమతి పొందక మామూలుగా ప్రచురణకి స్వీకరించిన కథల రచయితలకి ఆ విషయం ప్రచురించే ముందు తెలుపుతాము.